క్లుప్తంగా

గురుకుల పీజీటీగా స్వరూపారాణి


స్వరూపారాణి

ఎర్రుపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన గురుకుల పాఠశాలల టీచర్(పీజీటీ) పోస్టుల ఫలితాల్లో మండలంలోని పెద్దగోపవరం గ్రామానికి చెందిన చల్లా స్వరూపారాణి పీజీటీ(హిందీ) ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఈమె ఎర్రుపాలెం బీసీ గురుకుల పాఠశాలలో హిందీ గెస్ట్ టీచర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు స్థానికులు అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

మధిర: మధిర నియోజకవర్గ అభివృద్ధికి డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.334 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నిధులతో ఐదు మండలాల్లోని గ్రామాల్లో లింక్ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు చెరుకూరి నాగార్జున శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. భట్టి సీఎంగా బాధ్యతలు చేపట్టిన 70 రోజుల్లోనే నిధులు కేటాయించి మధిర అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఈ మేరకు మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

పరామర్శ..

పెనుబల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన సూరయ్యబంజర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు బెల్లంకొండ మధు తండ్రి వెంకయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. పెనుబల్లిలో వివాహ వేడుకకు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామారావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, దామోదర్, చిన్ననరసింహారావు, కమలాకర్‌రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో వైద్య పరీక్షలు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు ఆదేశాలతో పీఓ ఎస్.వెంకటాచారి ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీలో సింగరేణి మెయిన్ ఆస్పత్రి నుంచి దంత వైద్యులు అక్షయ్‌కుమార్, చర్మవ్యాధి నిపుణులు శ్రీకాంత్, డాక్టర్ నర్సింహారావులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ కార్మికులు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శంకుస్థాపన


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న తహసీల్దార్ ఉషాశారద

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు, మామునూరు, నర్సింహాపురం గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.31 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఎం.ఉషాశారద శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు తల్లపురెడ్డి ప్రవల్లిక, శీలం జయలక్ష్మి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, నర్సింహారావు, మోహన్‌రావు, పుల్లారెడ్డి, కృష్ణారావు, పిచ్చిరెడ్డి, రామిరెడ్డి, నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో అన్నప్రాసన వేడుకలు

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పలువురి చిన్నారులకు అన్నప్రాసన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత మాట్లాడుతూ.. చిన్నారులు వయస్సుకు తగ్గ బరువు ఉండేలా తగిన పోషకాహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాణి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

సత్తుపల్లిటౌన్: గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ డిమాండ్ చేశారు. శనివారం సత్తుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు స్కాలర్‌షిప్‌లే ఆధారమని, హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు గోపి, రామకృష్ణ, రవి, కిషోర్, ఆనంద్ పాల్గొన్నారు.

ఎండలు షురూ..


విక్రయానికి సిద్ధంగా ఉన్న కొబ్బరి బోండాలు


మధిరలోని పండ్ల దుకాణం


మధిర మెయిన్ రోడ్‌లో ఉన్న మట్టి కుండలు

- అనూహ్యంగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- రాత్రిపూట చలి.. ఉదయం ఉక్కపోత, వేడి
- అల్లాడుతున్న పిల్లలు, వృద్ధులు
- పెరిగిన సీజనల్ విక్రయాలు..

మధిర: భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఫిబ్రవరి ఆరంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ఎండాకాలంలో సీజనల్ వారీగా ఏర్పాటు చేసే దుకాణాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పలు కూడళ్లలో, ప్రధాన రహదారుల పక్కన చెట్ల కింద జ్యూస్ పాయింట్లు, కొబ్బరి బోండాలు, కూల్ డ్రింక్స్, లస్సీ, పుచ్చకాయలు, ఐస్ క్రీమ్స్ తదితర విక్రయాలు ఊపందుకోవడంతో వ్యాపారులు ఆయా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏసీలను సర్వీసింగ్ చేయిస్తున్నారు.

మొక్కల పెంపకం చేపట్టాలి..

మొక్కల పెంపకం విరివిగా చేపడితే వాతావరణం చల్లబడుతుంది. మొక్కలను పెంచకపోగా పలు నిర్మాణాలు చేపట్టేటప్పుడు ఖాళీ స్థలాల్లో ఉన్న చెట్లను తొలగించడం వల్ల ఎండ తీవ్రత స్పష్టంగా కనిపిస్తుంది.

పెరిగిన డిమాండ్..

ఈ సీజన్‌లో గోలీ సోడాతో పాటుగా చల్లని పానియాలు గ్యాస్ సోడా, నిమ్మరసం తదితర వాటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు సన్నద్ధమవుతున్నారు. పేదవాని ఫ్రిడ్జ్‌గా ఉన్న మట్టికుండలకు గిరాకీ బాగానే ఉంటుంది. ప్రస్తుతం ఒక్కొక్క మట్టి కుండ రూ.250లకు పైగా ధర పలుకుతుంది.

ఆందోళనలో ప్రజలు..

ప్రస్తుత పరిస్థితుల్లోనే ఎండలు మండుతుంటే రాబోయే మే నెలలో ఎండ తీవ్రత ఎంత ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పట్టణాల్లో భవన నిర్మాణాలు ఎక్కువగా ఉండడం వల్ల ఎండ తీవ్రతకు ఉక్కపోత ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం పూరిళ్లు కనుమరుగవుతున్న నేపథ్యంలో వృద్ధులు, పిల్లలు ఎండ వేడిమికి ఇబ్బంది పడుతున్నారు.

అమాంతం పెరిగిన ధరలు..

రాజమండ్రి, నరసాపురం, ఏలూరు ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్న కొబ్బరి బోండాల రేటు అమాంతం పెరిగింది. ఒక్కొక్కటి రూ.50 పైగా ఉంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే పేద ప్రజలు మంచినీటిని సైతం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కావున స్వచ్ఛంద సంస్థలు, దాతలు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా జ్యూస్ అమ్మకాలు..



రోజురోజుకు ఎండలు పెరగడం వల్ల జ్యూస్ సేల్స్ కూడా పెరిగింది. వేసవి తాపానికి ప్రజలు పండ్ల రసాలను, లస్సీని, చెరుకురసం తాగుతున్నారు. ప్రస్తుతం ఎండలు ఈ విధంగా ఉంటే రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

– కటికల బ్రహ్మారెడ్డి, జ్యూస్ పాయింట్ నిర్వాహకుడు

పండ్ల ధరలు పెరిగాయి..



ఈ సీజన్‌లో విక్రయించే యాపిల్స్, బత్తాయి, ద్రాక్ష, అరటి, కర్బూజా తదితర పండ్ల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. వేసవి వస్తుందంటేనే వాటి రేట్లు పెరుగుతుంటాయి. మధ్యాహ్నం సమయంలో ఎండ వల్ల జన సంచారం తక్కువగా ఉంటుంది.

– కృష్ణవేణి, పండ్ల వ్యాపారి

బిజీ అయ్యాం..



ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల వినియోగదారులు ఏసీలను ఆన్ చేస్తున్నారు. దీంతో ఏసీల సర్వీసింగ్ పని పెరిగింది. నూతనంగా ఏసీల ను ఫిట్ చేస్తున్నాం. విద్యుత్ కోత కూడా లేకపోవడంతో వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు అవసరమైన విద్యుత్ పరికరాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి.

– పిల్లలమర్రి ప్రసాద్, ఏసీ మెకానిక్

నిర్లక్ష్యానికి నిదర్శనంగా ట్రాన్స్‌ఫార్మర్

- నేలపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- పొంచి ఉన్న ప్రమాదం


నేలపైనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సత్తుపల్లి: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తోంది. విద్యుత్ సరఫరా అవుతూ నేలపైనే ఉంచటంతో ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని పెద్దవంతెన సమీపంలో శ్రీజ్ఞానసరస్వతీదేవి ఆలయం నుంచి పెద్దవంతెనకు వెళ్లే రహదారి పక్కనే ఉంది. అటుగా వెళ్లే ప్రజలు నేలపైనే ఉంచిన ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చూసి బాబోయ్.. ఇంకేముంది.. ఇంత ప్రమాదకరంగా ఉంచారేంటి అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసినా పట్టించుకున్న పాపాన పోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. చేతికందే ఎత్తులో.. నేలపైనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పశువులు, గొర్రెలు అటుగా వెళితే మృత్యువాతపడే అవకాశాలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


మాట్లాడుతున్న ఏఎంఓ రాజశేఖర్

కారేపల్లి: పిల్లలు క్రమం తప్పకుండా పరతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఎంఓ రాజశేఖర్ అన్నారు. శనివారం కారేపల్లి మోడల్‌స్కూల్‌లో (పీటీఏ) పేరెంట్స్ సమావేశాన్ని ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని, వారి మానసిక స్థితులకు అనుగుణంగా విద్యను అందిస్తే.. మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగలక్ష్మి, రాంప్రసాద్, జానకీ రాములు, బాబురావు, దావూద్, మణితాకుమారి, రోష్నాబి, నాగమణి, నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


ఏన్కూరు: నృత్యం చేస్తున్న ఉపాధ్యాయులు

ఏన్కూరు/కారేపల్లి: పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రత్యేకాధికారి ఉషారాణి, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం తెలిపారు. శనివారం ఏన్కూరులోని స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు, కారేపల్లిలోని కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్సాట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ప్రముఖ వైద్యురాలు పర్సా విజయలక్ష్మి దంపతులు ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, యాకయ్య, పార్థసారధి, శ్రీవనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా


మట్టి తరలిస్తున్న టిప్పర్లు

ముదిగొండ: హైవే పేరుతో మండలంలో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. ముదిగొండ మండలంలోని వెంకటాపురం, యడవల్లి, మేడేపల్లి సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమంగా మట్టిని టిప్పర్లతో తరలించడంతో రహదారులపై గుంతలు పడి ప్రమాదంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అనుమతులు గోరంతా, తవ్వేది కొండంతా అన్న చందంగా తయారైంది ఈ తతంగం. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో అధికారులకు భారీ మొత్తంలోనే ముడుపులు చెల్లించారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మట్టి తవ్వకాలు, అక్రమ మట్టి రవాణాను అదుపుచేసి, రహదారిపై గుంతలు పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల మధ్యలోనే వెళ్లిన ఉపాధ్యాయులు

కల్లూరు: విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొందరు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కల్లూరు మండలం చంద్రుపట్ల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు శనివారం మధ్యాహ్నం 3 గంటలకే వెళ్లినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని హెచ్ఎం దృష్టికి తీసుకెళ్లేందుకు యత్నించగా ఆయన ఇంకా ముందే డీఈఓ కార్యాలయంలో పని ఉందని ఖమ్మం వెళ్లినట్లు తేలింది. ఈవిషయమై ఎంఈఓ దామోదర ప్రసాద్‌ను వివరణ కోరగా వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని ముగ్గు వెంకటాపురంలో ఓ విద్యార్థినిపై శనివారం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి చింతకాయల ఉష అదే గ్రామంలోని కొత్త నిబంధన చర్చిలో శనివారం మధ్యాహ్నం నిద్రించింది. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె నోట్లో గుడ్డలు కుక్కి దాడి చేస్తూ పొట్టపై బ్లేడ్‌తో కోశారు. ఉష తేరుకుని పెనుగులాడుతూ కేకలు వేయగా దుండగులు పరారయ్యారు. కాగా, ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

సింగరేణి తహసీల్దార్‌గా సంపత్ కుమార్


తహసీల్దార్ సంపత్‌కుమార్

కారేపల్లి: సింగరేణి తహసీల్దార్‌గా సోమనబోయిన సంపత్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సంపత్‌కుమార్ కూసుమంచి నుంచి బదిలీపై సింగరేణికి రాగా.. ఇక్కడ పని చేస్తున్న సురేష్ కుమార్ బదిలీపై కూసుమంచి వెళ్లారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

చింతకాని: చింతకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ రమేష్ శనివారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఉన్నటువంటి సౌకర్యాలు, వసతులను పరిశీలించి మాట్లాడారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉషా, గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్.సైదులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కొణిజర్ల: గృహజ్యోతి పథకానికి అర్హులైన వారంతా ప్రజాపాలన దరఖాస్తు రసీదుతో పాటు ఆధార్, రేషన్ కార్డులు విద్యుత్ శాఖాధికారులకు చూపించి ఆన్‌లైన్ చేయించుకోవాలని పెద్దగోపతి ఏడీఈ బి.తిలక్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు అందుబాటులో అని వారంతా తమ ప్రూఫ్‌లతో సమీపంలోని విద్యుత్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. నమోదు చేయించుకొని వారికి ప్రభుత్వం అందించే 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం వర్తించదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: మండలంలోని పమ్మి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు పమ్మి విద్యుత్ ఏఈ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సన్మానాలు..

మాజీ సర్పంచ్‌కు..

కొణిజర్ల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అందించే అల్పాహారానికి, పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందించేందుకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించిన కొణిజర్ల మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు సూరంపల్లి రామారావును శనివారం పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ దొండ వెంకన్న, పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాస్ రాథోడ్‌కు..

బోనకల్: బోనకల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రాథోడ్ తెలంగాణ మూవీ, టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కమలరాజ్ మాట్లాడుతూ.. శ్రీనివాస్ రాథోడ్ హైద్రాబాద్ సినీ ఇండస్ట్రీలో గత కొన్ని సంవత్సరాలుగా ఆర్టిస్ట్‌గా ఉంటూ మూవీ, టీవీ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికల్లో పోటీ చేస్తూ మూడు సార్లు గెలుపొందటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావు, బానోత్ కొండ, బంధం శ్రీనివాసరావు, ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై సురేష్ సేవలు ప్రశంసనీయం


ఎస్సై సురేష్‌ను సత్కరిస్తున్న సీఐ, ఎస్సైలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఖమ్మం వీఆర్‌కు బదిలీ అయిన ఎస్సై ఎం.సురేష్‌ను మధిర సీఐ జె.వసంత్‌కుమార్, స్థానిక ఎస్సై వెంకటేష్, పలువురు ఎస్సైలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సదర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎస్సై సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మీభార్గవి, సంధ్య, మధు, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ


స్కూల్ గేటును ప్రారంభిస్తున్న ఎంఈఓ ప్రభాకర్

చింతకాని: మండలంలోని తిరుమలాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం స్కూలు బ్యాగులు, నోట్‌పుస్తకాలతో పాటుగా పెన్నులు, గ్లాసులు, ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కన్వీనర్ విజయ మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పేద విద్యార్థులకు దాతలు చేయూతనందించాలని తెలిపారు. ఈ సదర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, నాగులవంచ ఉన్నత పాఠశాల హెచ్ఎం కనపర్తి వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మరీదు రాధిక, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు గేటు వితరణ

మధిరరూరల్: మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2004–2005 పూర్వ విద్యార్థులు గేటు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ వై.ప్రభాకర్ ప్రారంభించి మాట్లాడారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి గేటు అందించడం అభినందనీయమని, భవిష్యత్‌లో కూడా వారి సేవలు ఇదేవిధంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్, కోటేశ్వరరావు, మాజీ సర్పంచులు లీలావతి, ప్రసాద్, సుబ్బారావు, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, పుల్లారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు


చింతకాని: సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రమేష్, రాజ్యలక్ష్మి

చింతకాని/బోనకల్: మండలంలోని వందనం గ్రామంలో, బోనకల్‌లోని రైతువేదికలో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు రమేష్, చందర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, ఎస్సై మధుబాబు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్ఐ లక్ష్మణ్ నాయక్, వైస్ ఎంపీపీ రమేష్, కొండ, నాయకులు పాల్గొన్నారు.

'విజయ'లో ఆన్ క్యాంపస్ డ్రైవ్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్‌బాబు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ మాగ్నైక్ సాఫ్ట్‌వేర్ వారు 2022–23లో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. ఆప్టిట్యూడ్, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూ రౌండ్‌లు నిర్వహించి 250 మందికి గాను 50 మందిని ఎంపిక చేసి ఏడాదికి రూ.6 లక్షల ప్యాకేజీతో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఖర్చుకు వెనకాడకుండా కళాశాల యాజమాన్యం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిందన్నారు. విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మాగ్నక్ సంస్థ సీఈఓ శంకర్, హెచ్ఆర్‌లు మౌనిక, సురేఖ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నయ్య, ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆయేషాతరుణమ్, డైరెక్టర్ అడ్మిషన్స్ డాక్టర్ ఫరీద్ బాబు, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, వివిధ విభాగాల హెచ్ఓడీ లు పాల్గొన్నారు.

మిస్ట్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్


శిక్షణ పొందిన విద్యార్థులతో యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల పాటు బీటెక్, ఎంటెక్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. స్టాడ్‌ప్రో సాఫ్ట్‌వేర్ ద్వారా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో అత్యాధునిక నిర్మాణాలను రూపొందించడానికి కావాల్సిన డిజైన్స్‌ను హైదరాబాద్ డిజైన్స్ ల్యాబ్ వారిచే శిక్షణ ఇచ్చారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను ఫీల్డ్ విజిట్ చేయటం జరిగిందని తెలిపారు. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం వస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ఎల్ఎస్ సాయి ఇంద్రసేనారెడ్డి, డీన్ జాకీర్ హుస్సేన్, కన్వీనర్ ఎస్.రామకృష్ణారెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


సత్తుపల్లి: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సండ్ర వెంకటవీరయ్య, నాయకులు


మధిర: కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలతో పాటుగా పలు చోట్ల నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానాలు చేసి.. కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనతో తెలంగాణ స్వర్ణయుగంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నేడు శివాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గుడిపాడులోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి శివాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆదివారం జరుగనున్నాయి. కాకతీయ కాలం నాటి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరటంతో నూతన ఆలయాన్ని సుమారు రూ.2 కోట్లతో పునఃనిర్మించారు. ఈ ఆలయంలో కాశీ నుంచి తెచ్చిన మరకత లింగం, నంది, నవగ్రహాలు, గణపతి, పెద్దమ్మతల్లి, ముత్యాలమ్మతల్లి ద్వారపాలకులు వంటి దేవతామూర్తుల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని తాళాయిపాలెం కోటిలింగ శైవక్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి ఆధ్వర్యాన పునఃప్రతిష్ఠ నిర్వహించనున్నారు. అనంతరం మహాఅన్నదానం నిరర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుక..

వేంసూరు: మండలంలోని గూడురులో కొలువైఉన్న నాగ్రేందస్వామి సహిత దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వేద పండితుల మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక పూజల కార్యక్రమాలతో కార్యసిద్ధి గణపతి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సుబ్రహ్మణ్యస్వామి..

ముదిగొండ: మండలంలోని అయ్యగారిపల్లిలోని శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 18న శ్రీఅభయ వరధ సుబ్రహ్మణ్యస్వామి 16అడుగుల నూతన విగ్రహ మహాకుంబాభిషేక, ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మునగలేటి రమేష్, వంశీశర్మలు శనివారం తెలిపారు. ఆలయంలో హోమాలు నిర్వహించారు. విగ్రహప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.